

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | గురువారం | నవంబర్ 16, 2023 | www.navatelangana.com



బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే

- బీఎస్పీ సిర్పూర్(టి) ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్
- దహెగాంలో ఎన్నికల ప్రచారం

2లో...



మధ్యాహ్న భోజన కార్మికులకు బడ్జెట్ కేటాయించాలి

- సీఐటీయూ ఆసిఫాబాద్ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి
- డీఈఓకు వినతిపత్రం అందజేత

5లో...

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్..!

- రేవంత్ సభకు తరలివచ్చిన భారీ జన సందోహం
- అధికారంలో రాగానే నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు
- బోథ్ రెవెన్యూ డివిజన్..కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి హామీ
- బోథ్, నిర్మల్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, బోథ్, నిర్మల్

ఆదిలాబాద్ జిల్లా బోథ్, నిర్మల్ నియోజకవర్గాల కాంగ్రెస్ ఎన్నికల సభలు విజయవంతమయ్యాయి. ఈ సభలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా రేవంత్ ప్రసంగం ..ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల్లో గెలుస్తామనే భరోసా తీసుకొచ్చాయి. సీఎం కేసీఆర్ వైఖరి, బీఆర్ఎస్ పాలనపై విరుచుపడటంతో ఆ పార్టీ శ్రేణులు చప్పట్లతో ఆనందించారు. ఈ పదేండ్ల పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు జరిగిన అన్యాయాన్ని వివరించడంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తొలుత బోథ్‌కు వచ్చిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్‌తో కలిసి మాట్లాడారు. అనంతరం నిర్మల్ సభకు వెళ్లి అక్కడి అభ్యర్థి శ్రీహరిరావుతో కలిసి ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో ఈ ఇద్దరు అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మీపై ఉందని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి గట్టి బుద్ధి చెప్పాలని వివరించారు.

మాస్టర్ ప్లాన్ రద్దు..బోథ్ రెవెన్యూ డివిజన్

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎడారిగా మారిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను అధ్యక్షుడినైన తర్వాత తొలిసారి నిర్మల్‌కు వచ్చానని..రెండో సభ దళిత దండోరా పేరుతో ఇంద్రవెల్లిలో సభ నిర్వహించినట్లు గుర్తుచేశారు. మామా- అల్లుడు కలిసి ప్రాణహిత చేవెళ్లకు అన్యాయం చేశారని విమర్శించారు. నిర్మల్ మాస్టర్‌ప్లాన్‌ను ఎన్నికల పేరుతో తాత్కాలికంగా వాయిదా వేశారని..బీఆర్ఎస్ గెలిస్తే మళ్లీ మాస్టర్ ప్లాన్ పేరుతో భూములను గుంజుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తామని..బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా గుర్తిస్తామని హామీనిచ్చారు. పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఓటేందుకు వేయాలని ప్రశ్నించారు. నిర్మల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావుకు ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. మరోపక్క నీళ్లు, నిధులు, నియామకాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో బోథ్ నియోజకవర్గానికి నీళ్లు ఎందుకు రాలేదని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న అధికారంలోకి రాగానే అదే నెల చివరి వకు కుప్టి ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, బోథ్‌లో మహిళా డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన చేస్తామని హామీనిచ్చారు.

మా

మిగతా..2లో...


బోథ్ సభలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి ఆడే గజేందర్

బెల్లంపల్లిలో గ్రూపు పోరుతో ప్రతికూల పరిస్థితులు

దుర్గం చిన్నయ్య గట్టెక్కేనా..?

- జనం నుంచి వినిపిస్తున్న నెగెటివ్ టాక్
- కాంగ్రెస్ నుంచి బరిలో బలమైన ప్రత్యర్థి
- మూడోసారి గెలుపుపై సర్వత్రా ఉత్కంఠ



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో రాజకీయాలు హీటెక్కిస్తున్నాయి. ఇటీవలే బీఆర్ఎస్ అభ్యర్థి తరపున సీఎం కేసీఆర్‌తో పాటు కాంగ్రెస్ అభ్యర్థి తరపున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటించి ఆయా పార్టీల

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తాజా ఎన్నికల్లో గట్టెక్కుతారా? ప్రతికూల పరిస్థితులను అధిగమించి విజయం సాధిస్తారా? అనేది ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఆయనపై ఇది వరకు వివిధ రకాల ఆరోపణలు రావడంతో నియోజకవర్గంలో జనం నుంచి నెగెటివ్ టాక్ వినిపించడం చర్చనీయాంశంగా మారుతోంది. బీఆర్ఎస్ తరపున రెండు సార్లు గెలిచి దశాబ్ద కాలం పాటు ఎమ్మెల్యేగా కొనసాగుతున్న చిన్నయ్యకు తాజా ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితులు తప్పేలా లేవనే అభిప్రాయం ఆ నియోజకవర్గంలో వినిపిస్తోంది. అరిజన్ డెయిరీ సీఈఓ శేజల్ వ్యవహారంలో దుమారం రేగడం నియోజకవర్గ వ్యాప్తంగా అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. మరోపక్క భూములను కబ్జా చేశారనే ఆరోపణలతో పాటు ఇతరులతో అహంకార పూరితంగా వ్యవహరిస్తారనే ప్రచారం జరుగుతుండటం ఆయనకు అవరోధంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మిగతా..2లో...

తేలిన అభ్యర్థుల లెక్క..!

- పది నియోజకవర్గాల్లో 148మంది పోటీ
- ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు బరిలోకి
- మరింత రసవత్తరంగా మారనున్న ఎన్నికల సమరం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల లెక్క తేలింది. పది నియోజకవర్గాల్లో 148 మంది బరిలో నిలువనున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అనంతరం బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు బుధవారం విడుదల చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వారి పార్టీల గుర్తులతో పోటీ చేయగా.. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించింది. ఇన్నాండ్లు గుర్తు లేకపోవడంతో ప్రచారానికి దూరంగా ఉన్న స్వతంత్రులు గురువారం నుంచి ప్రచారపర్వం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా బరిలో ఉండే అభ్యర్థులెవరో వెల్లడికావడంతో పోటీ మరింత రసవత్తరంగా మారనుంది. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో అనేక మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో దిగి వారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

పదింటిలో 148 మంది బరిలో..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా ఒక్కో దాంట్లో పదికి పైగానే అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొత్తంగా పదింటిలో 148 మంది బరిలో నిలువడం గమనార్హం. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 30మంది నామినేషన్లు వేయగా ముగ్గురివి తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన వారిలో ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో చివరగా 25మంది అభ్యర్థులు బరిలో నిలువనున్నారు. బోథ్ నియోజవకర్గంలో 13మంది నామినేషన్లు వేయగా ..ఒకటి తిరస్కరించబడింది. ఇద్దరు ఉపసంహరించుకోగా 10మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 17మంది నామినేషన్లు వేయగా నాలుగు తిరస్కరణకు గురయ్యాయి. ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. ఇక్కడ 11మంది బరిలో నిలిచారు. నిర్మల్ నియోజకవర్గంలో 18మంది నామినేషన్లు వేయగా నలుగురివి తిరస్కరణకు గురయ్యాయి. ఒకరు ఉపసంహరించుకోగా 13మంది అభ్యర్థులు పోటీలో ఉండనున్నారు. ముధోల్

మిగతా..2లో...

నవతెలంగాణ

అందరి ఆత్మీయ నాయకురాలు కోవ లక్ష్మి

నవతెలంగాణ - జైనూర్

ఆసిఫాబాద్ నియోజకవర్గం ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజా నాయకురాలు కోవ లక్ష్మి అని సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ, జైనూర్ మండల పార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధించిన నాటి నుండి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రజలను అన్ని విధాలుగా ఆదుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల గుండెల్లో ఉండే నాయకురాలుగా గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ వరుసగా మూడోసారి కోవ లక్ష్మికి టికెట్ ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరు ఆమెకు సహకరించి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆత్రం శంకర్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నూపటేల్, ఉప సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, మడావి భీంరావు, బీఆర్ఎస్ నాయకులు కబీర్ పాల్గొన్నారు.

దుర్గం చిన్నయ్య గట్టెక్కేనా..?

(మొదటి పేజీ తరువాయి)

శ్రేణులను ఉత్సాహపరిచారు. ప్రస్తుతం రెండు పార్టీలు అక్కడ బలంగా ఉన్నప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్యే చిన్నయ్యపై పలు ఆరోపణల నేపథ్యంలో ఆయన గెలుపుపై ప్రభావం పడుతుందని తెలుస్తోంది. అరిజన్ డెయిరీ సీఈఓ శేజల్ ఎమ్మెల్యే చిన్నయ్యపై ఆరోపణలు చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం ఢిల్లీ వరకు వెళ్లింది. మరోపక్క నియోజకవర్గంలో భూముల కబ్జాల్లోనూ ఆయన పాత్ర ఉందనే ఆరోపణలున్నాయి. వీటికి తోడు కాంగ్రెస్ గాలి వీయడం.. ప్రత్యర్థి పార్టీ నుంచి బలమైన అభ్యర్థి బరిలో ఉండటం కారణంగానూ చిన్నయ్యకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో చిన్నయ్య సామాజిక వర్గం ఓటర్లు అధికంగా ఉండటంతో సులువుగా గెలుస్తాననే ధీమా వ్యక్తమవుతున్నా..ఇతర సామాజిక వర్గాల్లో వ్యతిరేక పవనాలు వీయడంతో విజయంపై సందిగ్ధం నెలకొందనే భావన వ్యక్తమవుతోంది.

పార్టీని వీడుతున్న క్యాడర్..!

ఇది వరకు బలమైన క్యాడర్ కలిగిన బీఆర్ఎస్ పార్టీలో ఎన్నికల ముంగిట ముసలం నెలకొంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇన్నాండ్లు ఎమ్మెల్యే వెంట ఉన్న నాయకులు, అనుచరులు పలువురు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది. కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లో పలువురు నాయకులు గులాబీ గూటిని వీడి కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాసిపేట మండలంలోనూ బీఆర్ఎస్ నాయకులు పలువురు అసమ్మతి వర్గంగా ఉన్నారు. పార్టీ పెద్దలు వీరితో మాట్లాడి సర్దిచెప్పినప్పటికీ.. తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఎంత వరకు సహకరిస్తారనేది అనుమానంగా ఉంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల మధ్య దుర్గం చిన్నయ్య మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారా? లేదంటే ఓటమి ఎదురవుతుందా అనేది మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

తేలిన అభ్యర్థుల లెక్క..!

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో 23మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ముగ్గురివి తిరస్కరణకు గురయ్యాయి. ఆరుగురు అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో 14మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 21మంది నామినేషన్లు సమర్పించగా ముగ్గురివి తిరస్కరించారు. ఒకరు విత్‌డ్రా చేసుకోవడంతో 17మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సిర్పూర్(టి)నియోజకవర్గంలో 21మంది నామినేషన్లు వేయగా నలుగురివి తిరస్కరణకు గురయ్యాయి. మరో నలుగురు అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో 13మంది ఎన్నికల బరిలో నిలిచారు. మంచిర్యాల నియోజకవర్గంలో 25మంది నామినేషన్లు వేయగా మూడు తిరస్కరణకు గురయ్యాయి. నలుగురు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకున్నారు. చివరగా 18మంది అభ్యర్థులు ఎన్నికల సమరంలో నిలిచారు. బెల్లంపల్లిలో 25మంది నామినేషన్లు వేయగా తొమ్మిదింటిని అధికారులు తిరస్కరించారు. ముగ్గురు అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. 13మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. చెన్నూర్‌లో 30మంది నామినేషన్లు వేయగా ఆరింటిని అధికారులు తిరస్కరించారు. మరో 10మంది ఉపసంహరించుకున్నారు. చివరగా 14మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

పోరు మరింత రసవత్తరం..!

ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు వెల్లడి కావడంతో పోరు మరింత రసవత్తరంగా మారనుంది. ఇది వరకు ప్రధానపార్టీల అభ్యర్థులకు ఆయా పార్టీల టికెట్లు ఖరారు కావడంతో వాటి గుర్తులతో ముమ్మర ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కానీ స్వతంత్రులు మాత్రం గుర్తులు రాకపోవడంతో మిన్నకుండిపోయారు. తాజాగా ఎన్నికల సంఘం వీరికి సైతం గుర్తులు కేటాయించడంతో నేటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో ప్రచారాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో కొందరు స్వతంత్ర అభ్యర్థులు సైతం సత్తా చాటాలని భావిస్తున్నారు. ఇందులో కొందరు ప్రధాన పార్టీల నుంచి టికెట్లు ఆశించి దక్కని వారు ఉండగా మరికొందరు మాత్రం మొదటి నుంచి స్వతంత్రంగా బరిలో ఉండేందుకు సిద్ధమవుతూ ఎన్నికల బరిలో నిలుస్తున్న వారు ఉండటం గమనార్హం.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతానికి నీళ్లు, నిధులు కావాలని చాలా చోట్ల అడుగుతున్నారని..గాడిదకు గడ్డివేసి..బర్రెకు పాలు పిండితే ఏమొస్తుందని వ్యాంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించగానే ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఆదివాసీ, లంబాడాలు కాంగ్రెస్‌కు రెండు కండ్ల లాంటి వారని.. రాష్ట్రంలో 12 సీట్లలో చెరో ఆరు ఇవ్వాలని నిర్ణయించామని.. కానీ ఆదివాసులకు ఏడు..లంబాడాలకు ఐదు సీట్లు కావడంతో బోథ్‌లో తొలుత టికెట్ కేటాయించిన వన్నెల అశోక్‌ను మార్చి..లంబాడా వ్యక్తికి అందించామని..ఇల్లందు సీటు కోరం కనకయ్యకు ఇవ్వాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఆదివాసీ బిడ్డకోసం పొరిక బలరాంనాయక్ సీటు వదులుకున్నారని తెలిపారు. వన్నెల అశోక్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు. మరోపక్క వచ్చే నెల నుంచి కరెంటు బిల్లులు కట్టకూడదని..కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 200యూనిట్లు ఉచితంగా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్..!



రేవంత్‌రెడ్డి సభతో నిర్మల్, బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. ఆయా సభలకు ఉదయమే జనాలు వివిధ పల్లెల నుంచి ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తరలివచ్చారు. రేవంత్ వచ్చే సమయానికి సభా ప్రాంగణానికి భారీగా జనం తరలివచ్చారు. వేల సంఖ్యలో జన సందోహాన్ని చూసిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క రేవంత్ మాట్లాడుతున్న సమయంలో సీఎం సీఎం అంటూ కార్యకర్తలు హోరెత్తించారు. గమనించిన రేవంత్ డిసెంబర్ 9తేదీ వరకు ఓపికపట్టాలని సూచించడంతో ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లాలో మార్పు రావాలి.. కాంగ్రెస్ రావాలని జనంతోనే చెప్పించడంతో సభికులు రెండు చేతులు ఎత్తి మద్దతు తెలిపారు. ఈ సభ ముగిసిన తర్వాత రేవంత్‌రెడ్డిని సన్మానించేందుకు నాయకులు, కార్యకర్తలు పోటీపడ్డారు. ఈ రెండు చోట్ల సభలు విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణులు గెలుపుపై భరోసా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటక ఎమ్మెల్యే ప్రకాష్‌రాథోడ్, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, జడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, ఎంపీటీసీ రజియాబేగం, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, తలమడుగు మాజీ జడ్పీటీసీ బొల్లారం బాబన్న తదితరులు పాల్గొన్నారు.

బోథ్ సభకు హాజరైన ప్రజలు



అధికారం రాగానే సమస్యలు పరిష్కారం : ఆడె గజేందర్, బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బోథ్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషిచేస్తానని బోథ్ కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ అన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేయడం, కుప్టి ప్రాజెక్టు నిర్మాణంతో పాటు మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఆదివాసీ, గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే

నవతెలంగాణ-దహెగాం

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే బిజెపికి వేసినట్టేనని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని మొట్లగూడ, రావులపల్లి, శంకరాపురం, రాంపూర్, గెర్రివెల్లి, గెర్రె, లోహ, పికలగూడెం, చర్లిగూడ, కొంచవెల్లి, ఖర్జిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బిజెపిలు ఒక్కటై రహస్య ఒప్పందంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్, బిజెపి రెండూ దొందే దొందు పార్టీలేనని అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్పీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎస్పీ నేతృత్వంలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్న నమ్మకం లేదన్న ఆయన ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎస్పీని బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. నియోజకవర్గంలో బీఎస్పీని ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులందరూ ఒక్కటయ్యారని ఆరోపించారు. ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరికి ఓటు వేసిన వారు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థితో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అన్ని పార్టీలు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నాయని, హామీలు చూసి మోసపోవద్దని ఓటర్లను కోరారు. ప్రచారంలో పార్టీ జిల్లా నాయకులు పిల్లల తిరుపతి, అధ్యక్షులు ఎల్కారి ప్రశాంత్, దుర్గం దేవదాస్, షాకీర్, కవిత, లక్ష్మీ, స్వరూప పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎస్పీ సురేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం నుండి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వెంట పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, డిటి జితేందర్ ఉన్నారు.

రూ.7లక్షల నగదు పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-నస్పూర్

ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున నస్పూర్ ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నస్పూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో తనిఖీలు నిర్వహించగా నస్పూర్‌కు చెందిన కాసుమల్ల స్వామినాథన్ వద్ద రూ.7లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
నిర్మల్
3
గురువారం నవంబర్ 16, 2023

గుడుంబా స్థావరాలపై దాడి



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని మున్యాల, ఎర్రగుంట, రేవోజీపేట గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై బుధవారం ఎస్సై ప్రభాకర్ రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా గుడుంబా విక్రయించిన, తయారు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తానన్నారు. ఇందులో భాగంగా 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

- బైంసా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రాజేష్ బాబు



నవతెలంగాణ-ముధోల్

బ్రహ్మేశ్వర్ ఎత్తిపోతల సాగునీటి విషయంలో బీఆర్ఎస్ మహిళ నాయకురాలు రమాదేవి చేసిన వ్యాఖ్యలపై బైంసా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రాజేష్ బాబు తీవ్రంగా స్పందించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మహిళా నాయకురాలు రమాదేవి మండలంలోని ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండా చుట్టూ పక్కల గ్రామాలకు నీరు రాకపోవడానికి కారణం తానేనని ఆరోపించడం సరికాదన్నారు. అసత్య, అబద్ధపు మాటలతో బీఆర్ఎస్‌లో చేరి మీరు ఎంత ప్యాకేజీ తీసుకున్నారో అందరికి తెలుసని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలుగా ఉన్నప్పుడు స్థానిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా ఇతరులకు సీట్లు అమ్ముకున్న చరిత్ర మరచి పోయారని ఆరోపించారు. మరోసారి తనపై ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ముత్యం రెడ్డి, కోరి పోతన్న, రమేష్, సతీష్ రెడ్డి, శ్రీనివాస్, కదం సంతోష్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అబద్ధపు మాటలు నమ్మొద్దు

నవతెలంగాణ-ముధోల్

ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు చెప్పే అబద్ధపు మాటలను ప్రజలు నమ్మవద్దని, అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆ పార్టీ మహిళ నాయకురాలు పడకంటి రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఆష్ట, బ్రహ్మణ్ గాం, రాంటెక్ తో పాటు ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డిని కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌ని మరోసారి గెలిపించాల్సిన బాధ్యత ఓటర్లదేనే అన్నారు. బీజేపీ కోసం ఎంతో పని చేసినప్పటికీ తన టికెట్ ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ పీఏసీఎస్ ఛైర్మెన్ సురేందర్ రెడ్డి, సర్పంచులు సుకన్య రమేష్, వచ్చేలాబాయి, ఎంపీటీసీలు సునీత పోశెట్టి, బండారి గంగాధర్, ఆత్మ స్వరూప్, నాయకులు కిరణ్ కొమురెవార్, జై భీమ్, అరిఫోద్దీన్, ఎర్రం మురళి, మైసాజీ, నరేష్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

అధికారంలోకి వస్తే ఏకకాలంలో రుణమాఫీ

- ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్



నవతెలంగాణ-కుభీర్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భోస్లే నారాయణ్ రావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని చాత, రంగశివిని, రంగశివిని తండా, చాతతండా, మార్లగొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చామని గుర్తు చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, కేవలం కుటుంబ పాలన కొనసాగించారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ కాలేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందించలేదన్నారు. అధికారం కివచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, వంట గ్యాస్ రూ.500కే అందిస్తామన్నారు. గ్రామాల ప్రజలను మమేకం చేసుకొని పార్టీని గెలిపించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జైరాం, బంక బాబు ఉన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ విస్తృత ప్రచారం



నవతెలంగాణ-దస్తురాబాద్

కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ గ్రామాల్లో విస్తృంగా పర్యటిస్తు ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని రేవోజీపేట, మున్యాల గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారెంటి కార్డులను వివరిస్తు చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా 6 గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టారని, గెలిచిన ఆరు నెలల్లో పథకాలాన్ని అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ ప్రజలను మోసం చేస్తూ పరిపాలన సాగించారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేష్, చుంచు భూమన్న, రంజిత్, ఆనంద్, గాజుల రాజేందర్, కొమురెల్లి, నగేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం జోరందుకుంది. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని పొట్టిపెల్లి-కే గ్రామంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. మండల అభివృద్ధి బీఆర్ఎస్‌తో మాత్రమే సాధ్యమని నాయకులు ఉల్పజీ రాజు అన్నారు. సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని, రాబోయే రోజుల్లో సీఎం కేసీఆర్ మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. పార్టీ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నరెడ్డి, రవీందర్, భూమారెడ్డి, నరేష్, సురేష్, సాయన్న, మారెన్న, రాజు, ప్రశాంత్, నడ్పి భోజన్న, చిల్కన్న, వెంకటేష్, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉరేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన సంగి ఎల్లవ్వ(65) అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగాలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయి కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.... ఎల్లవ్వ కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతుంది. జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌లో మెరిసిన కేజీబీవీ విద్యార్థులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

జిల్లా స్థాయి కళ ఉత్సవ్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీలు మంగళవారం వరకు జరిగాయి. మండల కేంద్రానికి చెందిన కేజీబీవీ కళాశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు బుధవారం తెలిపారు. ఫోక్ సాంగ్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు కే.స్వర్ణ మొదటి స్థానం, ఫోక్‌డ్యాన్స్‌లో జాదవ్ ప్రవళిక మొదటి స్థానంలో నిలిచి గురువారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీల్లో పాల్గొంటారన్నారని ఎస్‌ఓ అపర్ణ తెలియజేశారు.



మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఇటీవల హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విశ్వరూప మహాసభ విజయవంతం కావడం పట్ల బొక్కల్‌గూడ ఎస్సీ కాలనీ యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ప్రధాని నరేంద్ర మోడీల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తమ చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ యువకులు పసుల సంతోష్, నవీన్, కిరణ్, అశోక్, రాకేష్, సతీష్, భూమన్న, ప్రమోద్, వేణు, ప్రేమ్, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లాండసాంగిలో ధర్మ సమాజ్ పార్టీ ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని లాండసాంగి గ్రామంలో బుధవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు పార్టీ అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహారాజ్‌కు డప్పుచప్పుళ్ల మధ్య ఘనస్వాగతం పలికారు. పారీ మేనిఫెస్టోలోని 10 హామీలను ప్రజలకు వివరిస్తు టార్చ్‌లైట్‌కు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు సురేష్, గంగన్న, బరుకుంటి రాజీవ్, కరాడి గంగన్న పాల్గొన్నారు.

17న ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-14 ,17 బాలబాలికల జోనల్ స్థాయి టెబుల్ టెన్నిస్, అండర్- 17 బాలుర కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సీహెచ్ కాంతారావ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట ఇంటర్నేషనల్ పాఠశాలలో టెబుల్ టెన్నిస్, ఇచ్చోడలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలుంటాయన్నారు. కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు రాష్ట్రపాల్ కు రిపోర్ట్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 7702035200 నెంబర్ కు సంప్రదించాలని పేర్కొన్నారు. కబడ్డీ క్రీడాకారులు 1-1-2007 తర్వాత జన్మించి 54 కేజీల లోపు బరువు ఉన్న క్రీడాకారులు అర్హులని తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీల కన్వీనర్ సురేష్ జోషి, ఆర్గనైజర్ జాడే రమేష్‌కు రిపోర్ట్ చేయాలని చేయాలని సూచించారు.

కంది శ్రీనివాస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-తాంసి

బీసీ మహిళ గంగ్రత్ సుజాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో గ్రామాలో తిరగకుండా అడ్డుకుంటామని బీసీ సంఘం మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీసీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళాలని కూడా చూడకుండా డబ్బు ఉందన్న హంకరంతో నోటికి వచ్చినట్లు మాట్లాడారన్నారు. మహిళాల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవడంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసి సంఘాల అధ్వర్యంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, వెంకన్న, భాగవండ్లు, రాజేష్, సదానందం, అరుణ్ పాల్గొన్నారు.

గొంతుకోసి వ్యక్తి హత్య

నవతెలంగాణ-బేల

గొంతుకోసి యువకుడుని హత్య చేసిన ఘటన మండలంలోని కరోని గ్రామంలో చోటు చేసుకుంది. జైనథ్ సీఐ కోల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోడసం బండు(35) వ్యసాయం కూలీగా పనిచేసుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం బోజనం చేసి పది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఉరిసమీపంలో బండు విగతజీవిగ పడ ఉన్నాడు. గమనించిన గ్రామస్తులు వెళ్లి చూడగా గొంతుకొసి ఉండడం, రోడ్డుపై రక్తం ఉండడంతో షాక్‌కు గురయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐతో పాటు ఎస్సై రాధిక అక్కడి చేసుకున్నారు. వివరాలను తెలుసుకున్నారు. విచారణలో మాత్రం బండుకు ఎవరి శత్రుత్వం లేదనే విషయం పోలీసులకు తెలిసింది. అయితే హత్యకు గల కారణాలను వెతుకుతున్నట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు తమ్ముడు తోడసం దోబి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై రాధిక తెలిపారు.

పుణ్యక్షేత్రం వెళ్లేవారికి ముందస్తు రిజర్వేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఈ నెల 25న ఆర్టీసీ ద్వారా తమిళనాడులోని అరుణాచలం గిరి పుణ్యక్షేత్రం వెళ్లే ప్రయాణికుల టూర్ ప్యాకేజ్ ముందస్తు రిజర్వేషన్‌ను 16 నుంచి ఉ: 11 గంటలకు ప్రారంభం అవుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిజర్వేషన్ కౌంటర్ లేదా వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని, 7382840334 నంబర్ కు సంప్రదించాలని సూచించారు.

నమ్మించి గొంతు కోసుడు కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-తాంసి

నమ్మించి గొంతు కోసుడు కాంగ్రెస్‌కి కొత్తేమీ కాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు డా. వన్నెల అశోక్‌తో పాటు బోథ్ నియోజకవర్గంలోని మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి జోగు రామన్న మాజీ ఎంపీ గొడం నగేష్, అభ్యర్థి అనిల్ జాదవ్‌తో కలిసి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్నెల అశోక్ తన డాక్టర్ వృత్తిని పక్కన పెట్టి ఐదు సంవత్సరాలుగా పార్టీకి సేవచేశారన్నారు. బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి పది రోజుల తర్వాత బీఫామ్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకొని వేరే వ్యక్తికి టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. సోయం బాపూరావ్ ఒక కోవర్ట్ అని, ఆయన ఆడిన నాటకంలో అమాయకుడు అశోక్ బలయ్యారని అన్నారు. ఐదు సంవత్సరాలగా ఎంపీగా ఉండి గిరిజనులకు ఏమి న్యాయం చేశాడో ఆదివాసి గిరిజనులు ఆలోచించాలన్నారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి అనిల్ జాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని నమ్మకం కలుగుతుందన్నారు. అశోక్‌కు పార్టీలో సమూచిత స్థానం కల్పింస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, కోఆర్డినేటర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి వలసలు : జెడ్పీ ఛైర్మెన్ జనార్ధన్



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ ఛైర్మెన్ జనార్ధన్

నవ తెలంగాణ-సిరికొండ

పదేండ్ల బీఆర్ఎస్ పాలన చూసి ఇతర పార్టీల నుంచి వలస వస్తున్నారని జెడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నుండి పలువురు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నిర్మల్ జిల్లా సీనియర్ నాయకుడు పైడిపెల్లి రవీందర్ రావ్, భరత్ చౌహాన్‌లతో కలిసి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుల కోసం రైతు బంధు, రైతు భీమా పథకాలు, నిరంతర 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా జాన్సన్ నాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుర్క బాపురావ్, పెందూర్ ప్రభాకర్, పుష్ప రాణి, మర్సుకొల తిరుపతి, హరి ప్రసాద్, సునీల్, దినేష్, గోవర్ధన్, లస్మన్న పాల్గొన్నారు.

నేటి సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయండి



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

నేడు సీఎం కేసీఆర్ పాల్గొననున్న ప్రజాశీర్వాద సభను ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయలని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. బుధవారం సభ నిర్వహించే డైట్ మైదానాన్ని పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలు సూచనలు చేశారు. సభ ఏర్పాట్లపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. సీఎం కేసీఆర్ సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరు కానున్నారన్న అంచనాల నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం జరగనున్న ప్రజశీర్వాద సభకు కార్యకర్తలు ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు కేసీఆర్ సభ ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్న తమ నాయకునికి విశేష ప్రజాదరణ లభిస్తోందని అన్నారు. కేసీఆర్ లాంటి సమర్ధవంతమైన నాయకత్వం దేశానికి ఎంతో అవసరముందన్నారు. తమ ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని తెలిపారు. తమ నాయకుడు ప్రజాభిమాన నాయకుడని అభివర్ణించారు. రానున్న రోజుల్లో చేయనున్న అభివృద్ధి గురించి సీఎం కేసీఆర్ తన సభలో ప్రస్తావిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు అజయ్, సంధ నర్సింగ్, భరత్, అశోక్ స్వామి, ఇమ్రాన్ రాజు, సాయిని రవికుమార్, దుర్గం శేఖర్, రంగినేని శ్రీనివాస్ రావు, సాజిదోద్దీన్ ఉన్నారు.

సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం ఎందుకు..?

- అసంతృప్తి వ్యక్తం చేసిన ఎన్నికల పరిశీలకులు

నవతెలంగాణ-తాంసి

ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని జిల్లా ఎన్నికల పరిశీలకులు బీజీ పాటిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కప్పర్ల, పొన్నారి గ్రామాల్లో పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత తాంసిలోని పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ సరైన వసతులు కనిపించపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్త చేశారు. పోలింగ్ వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు స్లీప్లను అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ రోజు తీసుకునే చర్యలు, బందోబస్తు, సమస్యాత్మక కేంద్రాల గురించి తెలుసుకున్నారు.



ఈకార్యక్రమంలో ఎంపీడీఓ భూమయ్య, తహసీల్దార్ లక్ష్మీ, ఏఓ రవీందర్, ఎస్సై శివరాం పాల్గొన్నారు.

పార్టీలు కాదు..అభ్యర్థులే ముఖ్యం

- సమర్థులకే తమ మద్దతంటున్న యువత
- ప్రలోభాలకు లొంగకుండా ఓటేస్తామంటున్న పౌరులు

నవతెలంగాణ-బోథ్

అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి యువత ప్రత్యేక పాత్ర పోషించనుంది. చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయి వారిది. యువతను అడ్డుకోవడంతో పాటు తమ వైపు ఆకర్షితులను చేసేలా ఆయా పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ అస్త్రాలకు పదునుపెడుతూ గాలం వేసేలా ఇప్పటికే సిద్ధమయ్యారు. ఇటీవల విడుదల చేసిన ఓటరు ముసాయిదాలో యువ ఓటర్లే ఎక్కువగా ఉన్నట్లు అధికారిక గణంకాల ద్వారా తెలుస్తోంది. యువతను తమకు అనుకూలంగా మార్చుకునేలా ప్రధాన పార్టీల నాయకులు తమ అనుభవాలను ఉపయోగిస్తున్నారు. వీరి అంచనాలకు అందకుండా యువత మాత్రం పార్టీలు కాదు.. తమకు అభ్యర్థులే ముఖ్యమంటోంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటును వేస్తామని చెబుతున్నారు. యువత ఓటర్ల మనోగతంపై నవతెలంగాణ కథనం...

ఓటరు ముసాయిదా ప్రకారం యువ ఓటర్ల సంఖ్య ఎక్కువ ఉంది. అయితే ప్రధాన పార్టీలు యువత ఓటర్లనే లక్ష్యంగా చేసుకుంటు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటి వరకు పార్టీలకు ఓటేసినా ఎలాంటి అభివృద్ధి జరగలేదని, గెలుపోటములను నిర్ణయించే శక్తి తమకు వచ్చిన విషయాన్ని గ్రహించిన యువత ఆలోచించి సమర్థులు, అభివృద్ధి చేసే వారికే తమ మద్దతు ఉంటుందని ప్రతినబూనారు. ఉన్నతంగా చదువుకున్న, సమర్థుడై, నీతివంతమైన పాలన అందించే వారినే ఎమ్మెల్యేగా గెలుపించుకునేలా యువత ఆలోచిస్తోంది.

స్వార్థపరులను అసెంబ్లీలకు పంపొద్దు..

-తుల హరీష్ సొనాల



ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసి లబ్దిపొందాలనే స్వార్థపరులను అసెంబ్లీకి పంపవద్దు. ఓటర్లు కూడా ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. స్వార్థపరులను చట్టసభలకు పంపిస్తే అవినీతి మరింత పెరుగుతుంది.

సమర్థుడికే నా ఓటు

-మొయిన్, సొనాల



ఎన్నికల్లో ఓట్ల కోసం డబ్బు, మద్యం పంచేవారి గెలిచాక సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని ప్రజల కష్టాలను పట్టించుకోరు. స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన సమర్థ నాయకుడిని ఎన్నుకుంటాం. విద్యావంతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటుపడే నాయకులను గుర్తించి గెలిపించుకుంటాం.

నిజాయితీగా పనిచేసే వారికే..

- కందుల రంజిత్ కుమార్, బోథ్



నిస్వార్థంగా పనిచేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసే నాయకుడే ఎమ్మెల్యే కావాలి. ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా నిజాయితీగా పని చేసే వారికే నా మద్దతు.

బీఆర్ఎస్‌లో వరుస చేరికలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో వరుస చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో జైనథ్ మండలం పిప్పరవాడ బీజేపీ వార్డ్ సభ్యులు, పద్మశాలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి మోరే శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో గులాబి గూటికి చేరారు. అదే విధంగా 48, 49 వార్డులకు చెందిన పలువురు యువకులు చేరగా ఎమ్మెల్యే వారికి గులాబి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ నల్ల దానం వాపసు తెస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఉచితంగా గ్యాస్ ఇస్తామని చెప్పి రూ.1200 లకు పెంచిందన్నారు. కేంద్రం అధిక ధరలతో సామాన్య ప్రజలను ముప్పుతిప్పలు పెడుతుందన్నారు. ఎన్నికల వేళ బూటకపు హామీలు ఇచ్చి వాటిని బుట్టదాఖలు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ప్రభుత్వ పనితీరును చూసే వేలాది మంది యువకులు పార్టీలోకి స్వచ్చందంగా చేరుతున్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి మంత్రం జపిస్తున్న కారు గుర్తు పార్టీకే ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షులు అజయ్, జిట్ట రమేష్, బొమ్మ కంటే రమేష్, యానిస్ అక్బాని, వెనుగంటి ప్రకాష్, ప్రహ్లాద్, పర్వీన్ ఫిరోజ్, పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

నూతన వైన్స్ దుకాణం ఏర్పాటును రద్దు చేయాలి



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఒకటవ వార్డులో నూతనంగా వైన్స్ దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారని, దాన్ని రద్దు చేయాలని కాలనీ వాసులు కోరారు. బుధవారం తహసీల్దార్ విజయ్ కుమార్‌తో పాఠశాలకు వెళ్ళే మార్గంలో వైన్సును ఎలా ఏర్పాటు చేస్తారని కాలనీ వాసులు అధికారులను ప్రశ్నించారు. వైన్సును అక్కడ నుండి తరలించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఎగ్గిడి నడిపి మల్లేష్, సురేష్, రాధ బాయి, లక్ష్మి, కళ్యాణి, రాజు, అశోక్, విజయ్ పాల్గొన్నారు.

అంగట్లో మైకులతో హోరెత్తుతున్న ప్రచారాలు



నవతెలంగాణ-నార్నూర్

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వారం రోజుల నుంచి గ్రామాల్లో ఉదయం నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల ప్రచార వాహనాలు తిరుగుతున్నాయి. బుధవారం మండల కేంద్రంలో వార సంత అంగట్లో ప్రచార వాహనంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోను వివరించారు. తమకు అనుకూలంగా ఉన్న అభ్యర్థికి కేటాయించిన గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

భోజన కార్మికులకు బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ముఖ్యమంత్రి అల్పాహార పథకం కోసం మధ్యాహ్న భోజన కార్మికులకు అవసరమైన బడ్జెట్ కేటాయించాలని, ప్రతి విద్యార్థికి రూ.25 చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించడానికి ముందుకొచ్చినా సరియైన బడ్జెట్ కేటాయించకుండా కార్మికులతో వెట్టి చేయించుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం కింద విద్యార్థులకు ఇడ్లీ, పూరి, బొంబాయి రవ్వతో ఉప్మా కిచిడి తయారు చేసి వడ్డించాలని జీవోను జారీ చేసిందన్నారు. కాని దానికి సంబంధించిన డబ్బులు ఇవ్వక మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టలు కొట్టే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో విద్యార్థికి 30 నుండి 40 రూపాయలు బడ్జెట్ కేటాయించాల్సి ఉన్నప్పటికీ కేవలం 10.50 పైసలు కేటాయించడం దారుణమన్నారు. రెబ్బెన మండలంలో ఏడు నెలలుగా పెండింగ్ బిల్లులు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కోడిగుడ్డు వారానికి మూడుసార్లు పెడుతున్నప్పటికీ గుడ్డుకు ఐదు రూపాయలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మార్కెట్లో గుడ్డు రేటు ఆరు రూపాయల నుంచి 7 రూపాయల వరకు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడి మాయ, రెబ్బెన మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డోంట్ డిస్టర్బ్..మా ఓటు కారుకే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు గ్రామాల్లో పట్టణాల్లో విస్తృతంగా పర్యటిస్తూ తమకు మాత్రమే ఓటు వేయాలని ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలానికి చెందిన నందు తన ఇంటికి ఎవరు వచ్చి ఇబ్బంది పెట్టొద్దంటూ ఫ్లకార్డు ఏర్పాటు చేశారు. తాము కారు గుర్తుకే జోగురామన్నకే ఓటేస్తామని ఓ ఫ్లకార్డ్ ఏర్పాటు చేసి ఇంటి ముందు ప్రదర్శించారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం



నవతెలంగాణ-కెరమెరి

బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకురాలు మర్సుకోల సరస్వతి అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రూరి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మీ తరఫున ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంచుతూ అభ్యర్థి కోవ లక్ష్మికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలే మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కడతాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిజెపి నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. నిలకడగా లేని నాయకుల మోసపూరిత మాటలను నమ్మి కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేయొద్దని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి, నాయకులు బుర్స పోచయ్య, కుమురం భీంరావు, కోవ ఇందిర పాల్గొన్నారు.

అవ్వ దీవించు...

నవతెలంగాణ-నార్నూర్

వృద్ధులకు పెన్షన్‌పెంచిన ఘనత కేసీఆర్‌దని, మూడోసారి కూడా దీవించాలని బీఆర్ఎస్ ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మీ కోరారు. బుధవారం మండల కేంద్రంతో పాటు భీంపూర్, కొత్తపెల్లి, గోండు, కోలాం గూడ, లంబాడీ తండాలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టోను వివరించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. వృద్ధురాలిని కలిసి మేనిఫెస్టో కరపత్రాలను అందించి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రూప్‌దేవ్, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావ్, సర్పంచ్ గజానంద్ నాయక్, మాజీ జెడ్పీటీసీ రూపవతి జ్ఞానోబా పుష్కర్, కో ఆప్షన్ మెంబర్ దస్తగిరి, నాయకులు సయ్యద్ ఖాసీం, కనక ప్రభాకర్ పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా బులాయి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలములోని రాజుర గ్రామంలో దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రతీ ఏటా నిర్వహించే బులాయి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దీపావళి పండుగ మొదటి రోజు ప్రారంభం అయి 3 రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు బుధవారం బులాయి, బొండొబా మట్టి ప్రతిమలను పెద్ద వాగులో నిమజ్జనం చేయడంతో ముగిశాయి. మొదటి రోజు మట్టితో బులాయి, బొండొబా ప్రతిమలను తయారు చేసి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆఖరి రోజు బతుకమ్మ వలె మధ్యలో ఉంచి యువతులు ఆడిపాడతారు. ఇలా చేయడం ఏండ్లుగా ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలు నిర్వహించారు.

ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బెండరలోని ఆదర్శ ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల ప్రిన్సిపల్ కనకయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి నైతం శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ దశలు ఎంతో గొప్పవని సరైన జీవిత లక్ష్యం ఎంచుకునే సమయం అని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్, వాంకిడి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సంపత్, ఆసిఫాబాద్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామదాస్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక పార్టీలను ఓడించాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు చిత్తుగా ఓడించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. బుధవారం గోలేటిలోని ఎక్స్‌రోడ్డులో సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ సమావేశాన్ని బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్కే గౌస్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నూతన కార్యాలయాన్ని గోలేటి ఎక్స్‌రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసి ప్రమాదబీమా రూ.10 లక్షలు చెల్లించాలని, కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి అందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, డ్రైవర్లకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, లాభాల్లో వాటా ఇవ్వాలని, సీఎంపీఎఫ్, కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలన్నారు. ప్రతినెల ఏడో తేదీన వేతనాలు ఇవ్వాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కోల్ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఒడ్డాల తిరుపతి, ఉపాధ్యక్షుడు బొద్దు లచ్చన్న, రవిప్రసాద్ గౌడ్, జాయింట్ సెక్రటరీలు గోపాల్, సాగర్, కోశాధికారి సతీష్‌తో పాటు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

రూ.2.66లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ఇట్యాల గ్రామం వద్ద ఇద్దరు వేరువేరు వ్యక్తుల నుంచి రూ.2.66 లక్షలు ఎలాంటి ఆధారాలు లేని నగదును బుధవారం పట్టుకున్నట్టు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇట్యాల గ్రామం వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఇట్యాల గ్రామానికి చెందిన పొన్న సాయికృష్ణ రూ.2 లక్షల నగదును తీసుకెళ్తుండగా అతిని వద్ద ఎలాంటి డబ్బుకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో పట్టుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే ఖర్జీ గ్రామానికి చెందిన పులగం మల్లేష్ రూ.66,500 నగదును తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్ చేశామని తెలిపారు.

జీపీ కార్యదర్శులు, బీఎల్ఓలతో సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలతో బుధవారం మండల అధికారులు సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎంఎ అలీం, తహసీల్దార్ భోజన్నలు పోలీస్‌స్టేషన్‌లో కనీస సౌకర్యాలు, ఓటింగ్ స్లిప్పుల పంపిణీకి సంబంధించి పలు సూచనలు చేశారు. దీంతో పాటు గ్రామ పంచాయతీలో చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం

నవతెలంగాణ-కౌటాల

ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం పార్టీ అభ్యర్థి కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు కోరారు. మండలంలోని పార్డీ, సాండ్గాం, వీరవెల్లి గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేపట్టారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ గెలుపును ఎవరు ఆపలేరని, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లకు మెనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యే కోనేరు కోనప్పను గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు డోంగ్రె మధుకర్, సెండె నాందేవ్, రాచకొండ అశోక్, పార్డీ సర్పంచ్ కొడిపె లక్ష్మీ, మాజీ సర్పంచ్ దౌలత్ ఉన్నారు.



స్థలం కేటాయించారు.. నిధులు మరిచారు

● డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం



నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు మండలంలోని రాళ్లపేట గ్రామ శివారులో స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం మరిచారని డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల హాస్టల్‌ను డీవైఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 77లో ఏడెకరాల భూమిని కేటాయించినప్పటికీ నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వ అధికారుల అలసత్వం కొట్టచ్చినట్టు కనిపిస్తుందని విమర్శించారు. పాఠశాల ఉన్నా పరిమితికి మించి ఇరుకు గదుల్లోనే 609 మంది విద్యార్థులకు విద్యనందించడం జరుగుతుందన్నారు. కొంతమంది విద్యార్థులకు 10 మూత్రశాలలు మాత్రమే ఉన్నాయని, పాఠశాలకు ప్రత్యేకమైన వసతిగృహం, భోజన శాల లేకపోవడం సోచనీయమన్నారు. ఒకే గదిలో 80 మంది విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, రాత్రి సమయాల్లో నిద్రపోవడానికి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు కేటాయించిన స్థలంలో నిధులు త్వరితగతిన మంజూరుచేసి భవన ప్రారంభ ప్రక్రియను మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపించాలి



నవతెలంగాణ-రెబ్బెన

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడుతూ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న బీఆర్ఎస్‌ను రాష్ట్రంలో ప్రజలు మూడోసారి గెలిపించాలని జడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. రెబ్బెనలో జాతీయ రహదారికి ఇరువైపుల గల వ్యాపార సముదాయాలను గంగాపూర్ కమాన్ నుండి రెబ్బెన డిగ్రీ కళాశాల వరకు ప్రతి దుకాణానికి తిరిగి బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి, మెనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొమ్మినేని శ్రీధర్, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, భరద్వాజ్, వినోద్ జైస్వాల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

వాంకిడి : ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బుధవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్ మండలంలోని పాటగూడ, డబోలి, పుల్లారా గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తుకారాం, సింగిల్‌విండో చైర్మన్ పెంటు, కోఆప్షన్ సభ్యుడు హైమద్, సర్పంచ్ కిష్టు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
గురువారం నవంబర్, 16, 2023

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

రామకృష్ణాపూర్ : బీఆర్ఎస్‌లో బీజేపీ నాయకులు అందుగుల శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు మంగళవారం అర్ధరాత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చెన్నూరు అభ్యర్థి బాల్క సుమన్ సమక్షంలో చేరారు. వారితో పాటు సీనియర్ నాయకులు జాడి యేసయ్య, మందమర్రి పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, నాయకులు కోల శ్రీనివాస్, రజినీ కాంత్, వెంకటాచారి, జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్దు మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అందుగుల శ్రీనివాస్, మాట్లాడుతూ పుటకో పార్టీ మార్చే వివేక్ వెంకటస్వామి వల్ల బీజేపీ పార్టీలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ పార్టీకి రాజీనామా చేసి గౌరవ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ నాయకత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌లో చేరామనిని తెలిపారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికలు

నవతెలంగాణ-దండేపల్లి

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు భారీగా కొనసాగుతున్నాయి. మండలంలో పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ విధివిధానాలు నచ్చకనే పార్టీని విడుతున్నట్లు కాంగ్రెస్‌లో చేరిన వారు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ మేనిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రిటైర్డ్ ఎంఈఓ మోర్పుటల సత్తయ్య, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నానయ్య, కార్తీక్, వినోద్ ఉన్నారు.



ప్రేమ్‌సాగర్‌రావుకు టీడీపీ నాయకుల మద్దతు

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణలో అక్టోబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌కు పూర్తి మద్దతును తెలియజేస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకులు తలారి రాజు, కుంచె భూపతి, గరిగంటి రాజయ్య, పెద్దపల్లి శంకర్ తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని టీడీపీ కార్యాలయం వద్ద ప్రేమ్‌సాగర్‌ను కలిసి పూర్తి మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రం కొందరి చేతుల్లోనే బంది అయ్యిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని పేర్కొన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రేమ్‌సాగర్‌రావు గెలుపుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ 5,16,17 వార్డుల ఇన్‌ఛార్జి వనపర్తి రాజేష్, మారు మల్లయ్య, నర్సయ్య, వనపర్తి కిరణ్, టీడీపీ నాయకులు బొజ్జ రవి, ఆవుల సుధాకర్, తలారి రాము, తలారి తిరుపతి, అక్కవత్తుల కాంతయ్య, గరిగంటి సరళ, తలారి సునీత, మారమ్మ, సుమ, సంధ్య రాణి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-తాండూర్

అధికారులు ఎన్నికల నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దత్త ఐఏఎస్ తెలిపారు. ఆయన బుధవారం తాండూర్ మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు రేపల్లెవాడ వద్దగల జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద నిఘా ఉంచాలని తెలిపారు. అక్రమ మద్యం అనుమతి లేని నగదు రవాణాపై దృష్టి సారించాలన్నారు. పోలింగ్ స్టేషన్లో సౌకర్యాలను పరిశీలించారు. ఆయనతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, తాండూర్ సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ రోహిత్ తాండూర్ ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనంలో డాక్టర్ రవికిరణ్ యాదవ్

నవతెలంగాణ-భీమారం



యాదవ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవన విధానానికి భరోసా కల్పించాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని ఖాజీపల్లీ గ్రామంలో నిర్వహించిన గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టి యాదవుల ఆర్థిక అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఐనప్పటికీ కాపరులు తమ్ జీవనోపాధి మమేకమైన పలు సందర్భాల్లో కాపరులు ప్రమాదంలో చనిపోయి వారి కుటుంబాలకు భరోసా లేకుండా పోతుందన్నారు. మృతి చెందిన గొర్ల కాపరులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అదేవిధంగా యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి గొల్ల కురుమలకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఎలక్షన్ పూర్తి కాగానే రెండో విడత గొర్రెల పంపిణీ డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి గొర్రెల పంపిణీ చేపట్టాలని కోరారు. గొల్ల కురుమల్లో చదువుకున్న నిరుద్యోగ యువకులకు పశు సంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చెరుకు సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు చేగుంట రాజన్న యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షుడు సన్నీ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి అక్కల మధుకర్ యాదవ్, భీమిని మండల అధ్యక్షుడు సిరంపోచన్న యాదవ్, కోటపల్లి మండల అధ్యక్షుడు మద్దూరిగట్టయ్య యాదవ్, చెన్నూరు మండల అధ్యక్షుడు అక్కిం ఓదన్న యాదవ్, యూత్ అధ్యక్షుడు అక్కేమ్ తిరుపతి యాదవ్, నియోజకవర్గ కార్యదర్శి బట్టి మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తా : ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-నస్పూర్



ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తానని అందుకే ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, ఒకసారి అవకాశం ఇస్తే మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివద్ధి చేసి చూపిస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు, మంచిర్యాల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని కొత్త రోడ్ సమీపంలో గల అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో 5,16,17 వార్డు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేలా అధికారం కోసం, కమిషన్ల కోసం పనిచేసే మనిషిని కానని, అధికారం ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయడమే నా దేయమని అన్నారు. ప్రేమ్‌సార్ రావును గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సింగరేణి ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కొందరికి ఇళ్ల పట్టాలను ఇచ్చి, మరికొందరికి పట్టాలి ఇవ్వకపోవడం ఇప్పుడున్న ప్రభుత్వ ప్రతినిధుల చేతగానితనమని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందరికీ పట్టాలను అందజేస్తామని, రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. ముఖ్యంగా నస్పూర్ ప్రాంతాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, శ్రీరాంపూర్ ఏరియాలో లైబ్రరీని కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్లు తెలుగు లావణ్య, సురిమిల్ల వేణు, కాంగ్రెస్ నాయకులు వనపర్తి రాజేష్, తెనుగు దేవేందర్, మారు మల్లయ్య, అంగడి రాజేష్, కోటగిరి రాజయ్య, చిలుక మల్లేష్, టీడీపీ నాయకులు తలారి రాజు, గరిగంటి రాజయ్య, కుంచె భూపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు కాంగ్రెస్ నాయకుల చేరిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట

కాంగ్రెస్ వార్డ్ సభ్యులు స్వామి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో బుధవారం చేరారు. లక్షెట్టిపేట మండలంలోని రంగపేట గ్రామ మహేంద్ర సంఘం, కాంగ్రెస్ వార్డ్ మెంబర్ కోడిజుట్టు స్వామి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి చూసి, మంచిర్యాల నియోజకవర్గలో నడిపెల్లి దివాకర్ రావుతో కలిసి పనిచేయాలని పార్టీలో చేరుతున్నాని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించేల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, చిప్పకుర్తి నారాయణ, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

బీర్సా ముండా జయంతి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కొండాపూర్ యాసలో బుధవారం బీర్సా ముండా 148వ జయంతిని ఆదివాసీ సేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గిరిజనులపై జరుగుతున్న దోపడికి వ్యతిరేకంగాణ గిరిజనులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించి బ్రిటీష్ ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా గిరిజన సమాజాన్ని ఏకీకృతం చేసి ఆదివాసీలకు అండగా నిలిచారని సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన అధ్యక్షుడు మడావి వెంకటేశ్, గౌరవాధ్యక్షులు మడావి గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ పెందూర్ శంకర్, ప్రధాన కార్యదర్శి సిడం గణపతి, ఉపాధ్యాక్షులు పెంద్రం ప్రభాకర్, కోశాధికారి ఆత్రం సంజీవ్. పటేల్ మడావి రాము పాల్గొన్నారు.


పీఎస్సార్ గెలుపు నల్లేరు మీద నడకేనా..?

● ప్రచారంలో దూసుకుపోతున్న ప్రేమ్‌సాగర్‌రావు ● కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ● కలిసి రానున్న సేవా కార్యక్రమాలు, సానుభూతి

మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ దూసుకుపోతోంది. అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు ప్రచారంలో ముందున్నారు. గత పర్యాయం గెలుపుకు దగ్గరగా వచ్చి కేవలం 4వేల ఓట్ల తేడాతో ఓటమి చెందాడు. అయినా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని నిరంతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సారి సానుకూల పవనాలు వీస్తున్నాయి. ఆయనను గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆయన ప్రచారానికి పల్లెల్లో, పట్టణాల్లో జనాలు తండోపతండాలుగా వచ్చి మద్దతు తెలుపుతున్నారు. పీఎస్సార్ గెలుపు తథ్యమనే భావన నియోజకవర్గ వ్యాప్తంగా వినిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. చేస్తున్న సేవా కార్యక్రమాలు, ఆయన సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చరిష్మా, బలమైన క్యాడర్‌తో ఈ సారి గెలుపు నల్లేరు మీద నడకే అంటున్నారు పార్టీ కార్యకర్తలు.

నవతెలంగాణ - హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాలున్నాయి. బెల్లంపల్లి, చెన్నూర్ ఎస్సీ రిజర్వ్‌డ్, మంచిర్యాల జనరల్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుండి బలమైన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ కొక్కొరాల ప్రేమ్‌సాగర్ పోటీ చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్సీగా చేసిన అనుభవం, గత పర్యాయం స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందాడు. అయినా కుంగి పోకుండా మరుసటి రోజు నుండే నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. సేవా గుణం కలిగిన వ్యక్తిగా పేరున్న ప్రేమ్‌సాగర్‌రావుకు ఈ ఎన్నికల్లో గెలుపు సునాయాసమని కాంగ్రెస్ వర్గాలు, సర్వేలు చెబుతున్నాయి. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఐదేళ్లుగా నియోజకవర్గంలో ప్రతి గడపను తాకుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వచ్చే ఎన్నికల్లో ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని ముమ్మర ప్రచారం చేశారు. పీఎస్సార్ కూడా అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ అనుచరులను కాపాడుకుంటూ వచ్చారు. బలమైన క్యాడర్‌ను తయారు చేసుకున్నారు. నియోజకవర్గంలో పీఎస్సార్ అంటే తెలియని వారు లేరనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ శుభకార్యమైన ఈయనకు ఆహ్వానం అందుతుంది. తప్పకుండా హాజరవుతూ వస్తున్నారు. ఆయన వెంట ఒక సైన్యంలా అనుచరగణం ఉంటూ వస్తోంది. ఆయన వాహన శ్రేణి చూస్తే అధికారంలో ఉన్న మంత్రుల లాగా ఉంటుంది. అవసరాల కోసం ఆయన గడపతొక్కే వారికి భరోసా కల్పిస్తూ వస్తున్నారు.



సేవా కార్యక్రమాలే గెలుపుకు నాంది..

ప్రేమ్‌సాగర్‌రావు పదేళ్ల క్రితం తన తండ్రి కొక్కిరాల రఘుపతిరావు పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు చీరలు బహుమతిగా అందిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న దేవాలయాలకు విరాళాలు అందజేస్తున్నారు. మరణించిన కుటుంబాలకు పార్టీలతో సంబంధం లేకుండా ఆర్థిక సాయం చేస్తున్నారు. ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స తీసుకుంటున్న వారికీ ఆర్థిక సాయం చేస్తూ పైఆసుపత్రులకు దగ్గరుండి రెఫర్ చేయిస్తూ ప్రాణాలను రక్షించే కార్యక్రమాలు చేపడుతున్నారు. బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండగలకు నిత్యావసర సరకుల పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల బంధువులు సుమారు 19వేల మందికి భోజనాలు పంపిణీ చేశారు. ఎమ్మార్పీ ధరలకే రెమిడెసివియర్ ఇంజెక్షన్లు అందజేశారు. ఆక్సిజన్ సిలిండర్లు దొరకని సమయంలో సొంత ఖర్చులతో సిలిండర్లు అందించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 1600 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తూ సామగ్రి అందజేస్తున్నారు. ఇప్పటికీ ఎండాకాలంలో మంచిర్యాల పట్టణంలో 10 ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ముఖ్య కూడళ్లలో అంబలి, చల్లని మినరల్ వాటర్ సప్లై చేస్తున్నారు. మాతాశిశు ఆసుపత్రిలోకి వరద నీరు ప్రవేశించిన సమయంలో గర్భిణులను, పిల్లలను సొంత ఖర్చులతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వరదలో మునిగిన వివిధ కాలనీవాసులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సేవలు అందించారు. నిత్యావసర సరకుల అందజేశారు. ఈ సేవా కార్యక్రమాలతో ఈ సారి ఎన్నికల్లో పీఎస్సార్ గెలుపు సులువు కానుందని నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది.



ప్రచారంలో భాగంగా ప్రజలతో కలిసి నినదిస్తున్న ప్రేమ్‌సాగర్ రావు



ప్రచారంలో భాగంగా వృద్ధురాలికి అభయం ఇస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

పాఠశాలల నిర్వహణలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాలల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమైనదని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో జిల్లా విద్యాధికారి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లక్ష్య, ఉన్నతి, ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. లక్ష్య కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు అభ్యసన దీపికలు ఇప్పటికే అందించడం జరిగిందని ఈ నెల నుంచి ప్రతి పాఠశాలలో దానిపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సిలబస్ పూర్తికాని పాఠశాలలో డిసెంబర్‌లోగా పూర్తి చేసి, తరువాత అభ్యాసన దీపికలను అభ్యసనం చేయించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసనానికి ఎక్కువ సమయాన్ని కేటాయించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకుంటున్న తరగతులను పరిశీలించాలన్నారు. ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉన్నతి కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయుడు బోధనకు 40 శాతం అభ్యసనానికి, 60 శాతం సమయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు బేస్ లైన్ పరీక్ష ద్వారా తన తరగతిలో విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠశాల లైబ్రరీలో చదివించడం చేయాలని కోరారు. విద్యార్థులు చదివిన అంశాలను ప్రత్యేక నోట్ బుక్కులో రాసి దాన్ని రికార్డుగా భద్రపరచాలన్నారు. గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు కూడా వారి సబ్జెక్టుతోపాటు భాషా పరిజ్ఞానం పెంపొందించేలా బోధన చేయాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ, పాఠ్యప్రణాళిక, వార్షిక ప్రణాళిక, వర్క్ బుక్ లతోపాటు బోధన అభ్యసన సామాగ్రిని కూడా ఉపయోగించాలని కోరారు. విద్యార్థులకు వర్క్ బుక్ అభ్యసనం చేసే విధంగా వివిధ పద్ధతుల్లో ప్రోత్సహించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు చేస్తున్న బోధనను తరగతి గదిలోకి వెళ్లి పరిశీలించి సూచనలు చేయాలన్నారు. అంతకు ముందు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహారం పథకాన్ని పటిష్టంగా అమలుచేయాలన్నారు. విద్యార్థుల ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం ద్వారా ఎంతమంది విద్యార్థులు అల్పాహారం చేశారో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. 2022-23వ సంవత్సరంలో ఇన్‌స్పైర్‌లో సెలెక్ట్ అయిన విద్యార్థుల ప్రాజెక్టులను డిసెంబర్‌లో జరగబోయే ఎగ్జిబిషన్‌కు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ ఉదయభాబు, సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్లు సుభాష్ రాథోడ్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ మదూకర్, జెండర్ సెన్సిటివ్ కోఆర్డినేటర్ అబీదలి, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లాలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి

ముగిసిన దండారీ ఉత్సవాలు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని చిన్న సాకడ గ్రామంలో జరిగిన దండారీ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. గత వారం భోగి కార్యక్రమంతో ప్రారంభమైన దండారీ ఉత్సవాలు కొలబోడితో ముగిశాయి. ముగింపు దండారి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలతో భక్తి శ్రద్ధలతో ఎత్మసూర్ పెన్‌కు ప్రత్యేక పూజలు చేసి సంప్రదాయ నృత్యాలు చేశారు. మహిళలు రెలా పాట నత్యాలు చేస్తూ ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ గ్రామం నుంచి మరో గ్రామానికి దండరీ బృందం వెళ్లి తమ అతిథ్యాన్ని స్వీకరించి చివరి రోజు ప్రతి ఇంటింటికి వెళ్లి దండరీ బందానికి హారతి ఇచ్చి, ప్రతి ఇంటి నుండి బియ్యాన్ని స్వీకరించారు. అనంతరం గ్రామంలో బయట ఉన్న ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీలు, పోరిలు, పురుషులు, మహిళలు దండరీ దీక్షను విరమించారు. తదనంతరం ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీ టోపీలు, డప్పులు, కోలాట సామగ్రి, సంప్రదాయ వాయిద్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వీకరించిన బియ్యాన్ని వండి సహపంక్తి భోజనాలు చేసి కొలబోడి కార్యక్రమంతో దండరీ ఉత్సవాలను ముగింపు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావు, గ్రామ పటేల్ దంభిరావు, దండరి యజమాని ఇశ్ర, జలపతి, శ్రీనివాస్, తుకరాం, సోము, సాగర్, జంగు, భీము, అర్జున్, లక్ష్మణ్ ఉన్నారు.

అహంకారి కావాలా? ఆత్మ గౌరవం కావాలా?

నవతెలంగాణ-మందమర్రి

అహంకారి కావాలా? ఆత్మ గౌరవం కావాలా? అని ప్రజలు, కార్మికులే తేల్చుకోవాలని కాంగ్రెస్ నాయకులు వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మందమర్రి కెకె 5 బొగ్గు గని మీద బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. సింగరేణి కార్మికులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని, తన తండ్రి కాకా వెంకటస్వామి కృషి వల్లనే దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు పెన్షన్ అందుబాటులోకి వచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఒక్క కొత్త భూగర్భ గని కూడా ప్రారంభించలేదన్నారు. సింగరేణి కార్మికులు చెమటోడ్చి సంపాదించిన నిధులను సింగరేణి ప్రాంతాల్లో కార్మికులకు మౌలిక సదుపాయాలకు ఖర్చు పెట్టకుండా వేలకోట్ల రూపాయలను సిద్దిపేట, సిరిసిల్ల గజ్వేల్ ఇతర జిల్లాలకు తరలిస్తూ సింగరేణి సంస్థ దివాళా తీసే విధంగా చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గుర్తింపు సంఘం తప్ప ఎమ్మెల్యేలు, ఎంపిలు, నాయకులు సింగరేణిలో తల దూర్చే వారు కాదన్నారు. ప్రస్తుతం క్వార్టర్లు కావాలన్నా, బదిలీ, ప్రమోషన్ కావాలన్నా ఎమ్మెల్యే జీఎం కార్యాలయానికి కాల్ చేసి చెప్పిన వాళ్లకే కేటాయిస్తూ అధికార దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కాంపల్లి సమ్మయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిశెట్టి నరేందర్, రామకృష్ణాపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, నాయకులు అజీజ్, పైడిమల్ల నర్సింగ్, పుల్లూరు లక్ష్మణ్, వెంకటస్వామి, చంద్రశేఖర్, సదయ్య, రాజేంద్రప్రసాద్, స్వామి, కృష్ణమోహన్, చక్రపాణి, శ్రీకాంత్, తిరుపతి పలువురు కార్మికులు పాల్గొన్నారు.



ఓటు హక్కు భావితరాల భవిష్యత్తుకు మైలు రాయి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఓటు హక్కు భావితరాల భవిష్యత్తుకు మైలు రాయి అని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు అనే ఆయుధాన్ని దేశ అభివృద్ధి కోసం, సమాజ మార్పు కోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తమ్మిడే భీమేష్ అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటు హక్కు అనేది సమాజం అభివృద్ధికి ఉపయోగపడేలా మంచి నాయకున్ని ఎంచుకోవాలని తెలిపారు. మనం వేసే ఓటు ఐదు సంవత్సరాలు అన్నం పెట్టేలా ఉండాలని, ఒక్కరోజు బిర్యానీ ప్యాకెట్‌కు, మందు సీసాకు అమ్ముడు పోవద్దన్నారు. సమాజాన్ని నాశనం చేయాలన్నా, అభివృద్ధి చేయాలన్నా ఒక్క ఓటు హక్కుతోనే సాధ్యమన్నారు. యువత ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వసాకే సాయికుమార్, కాగజ్‌నగర్ మండల నాయకులు నవీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వార్డుల్లో ప్రచారం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చెన్నూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ గెలుపు లక్ష్యంగా 22 వార్డుల కౌన్సిలర్లు వార్డు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పట్టణ అధ్యక్షులు కంభగోని సుదర్శన్ గౌడ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని సాధారణ పరిశీలకులు గణేష్ బాపూరావు పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత ఎన్నికల సంఘం నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలీస్ పరిశీలకులు అశోక్ గోయల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలో స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రచార ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని సూచించారు. అభ్యర్థులు గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు, సభలు, సమావేశాలు, వాహన ర్యాలీలకు రిటర్నింగ్ అధికారి అనుమతులు పొందాలన్నారు. ప్రచారంలో భాగంగా వ్యక్తిగతంగా దూషించిన, దుర్భాషలాడిన, నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సి-విజిల్ యాప్ ద్వారా ఫోటో, వీడియోలు అప్ లోడ్ చేస్తే, వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రచారానికి సంబంధించిన అనుమతులకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందవచ్చని అన్నారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలను కలెక్టర్, పరిశీలకులు నివృత్తి చేశారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మొహతో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఇందిరా డబ్బులకు అమ్ముడుపోయింది'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బహుజన్ సమాజ్ పార్టీ నుంచి టికెట్ పొంది నామినేషన్ వేసిన అనంతరం చిల్లర పైసలు కోసం ఉయిక ఇందిరా అమ్ముడుపోయిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గడుగు మహేందర్ అన్నారు. బుధవారం బోథ్ మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఆదివాసి ఉద్యమ నాయకురాలిగా ఉయిక ఇందిరా నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీ బీఫామ్ ఇస్తే జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి చిల్లర పైసలకు అమ్ముడుపోయిన ఆమెకు ఎప్పటికీ క్షమించదన్నారు. ఓట్లను, సీట్లను అమ్ముకునే, కొనుక్కునే కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని బహుజన సమాజం నమ్మవద్దని అన్నారు.

నామినేషన్ విత్‌డ్రా..కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ఉయిక ఇందిరా తన నామినేషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. ఆ పార్టీకి షాక్ ఇస్తూ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో పార్టీ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలూరి మాట్లాడుతూ రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యే జోగు రామన్న చేసింది ఏమీ లేదని అన్నారు. స్థానిక రిమ్స్ ఆస్పత్రితో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటివరకు వైద్యుల కొరత ఉందన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలతో విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఉయిక ఇందిరా పార్టీలో చేరడంతో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదివాసి ఓట్లు కాంగ్రెస్ వైపు వచ్చే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలందరూ తమ ఓటు హక్కుని నిర్భయంగా సద్వినియోగం చేసుకునే విధంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. దేవాపూర్ ఆటో స్టాండ్ నుంచి శ్రామిక నగర్, ప్రసన్నాంజనేయ నగర్, ఓల్డ్ అంగడి బజార్, గొల్లవాడ రాంపూర్ ఏరియా మీదుగా తిరిగి ఆటో స్టాండ్ వరకు దేవాపూర్ గ్రామంలో 70 మంది మందమర్రి సర్కిల్ పోలీస్ సిబ్బంది ఎఫ్ కంపెనీ సీఆర్పీఎఫ్ సిబ్బంది, ఉమెన్ బెటాలియన్ ఫోర్స్‌తో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, కాసిపేట ఎస్సై గంగారాం, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు మండల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-జన్నారం

జన్నారం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కుంట సుశాంత్ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపికైనట్లు ఎంఈఓ విజయ్ కుమార్ తెలిపారు. ఆ విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఉదయం పాఠశాలలో ఆయనను అభినందించి శాలువాతో సత్కరించారు. మంచిర్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన చెన్నూరు మండలంలోని అర్జాన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అండర్-14 వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ్రు జనార్దన్, వ్యాయామ ఉపాధ్యాయులు యాకూబ్, సత్యనారాయణ, ఓం ప్రకాష్ చందులాల్ పాల్గొన్నారు.

కేటీఆర్ సభాస్థలి పరిశీలన

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 17న జన్నారం మండల కేంద్రానికి ఐటీ శాఖ మంత్రి తారక రామారావు వస్తున్న సందర్భంలో ఏర్పాటు చేసిన సభాస్థలిని రామగుండం సీపీ రెమ రాజేశ్వరి బుధవారం పరిశీలించారు. అనంతరం ఏరిపాట్లను పరిశీలించి, పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏసీపీ డీసీపీలకు సూచించారు.

తాండూర్‌లో పోలీసుల కవాతు

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం సివిల్, సిఆర్‌పిఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ సదయ్య మాట్లాడుతూ ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు లోనుకాకుండా ఎన్నికల్లో స్వేచ్ఛగా పాల్గొనాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకుంటారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యగా రౌడీ షీటర్లను బైండోవర్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్, మాదారం ఎస్సై అశోక్, సిఆర్పిఎఫ్ మహిళా జవాన్లు పాల్గొన్నారు.

డిమాండ్ మేరకు పని కల్పించాలి

నవతెలంగాణ-తాండూర్

నైపుణ్యతలేని కూలీలకు డిమాండ్ మేరకు పని కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి తెలిపారు. బుధవారం మండల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభం కావాలని తెలిపారు. నర్సరీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలోని ఉపాధి హామీ కూలీల ఆధార్ నెంబర్‌ను బ్యాంకు అకౌంట్‌కు త్వరితగతిన అనుసంధానం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, నోడల్ ఆఫీసర్ సదానందం, ఏపీవో నందకుమార్, టీఏలు లక్ష్మీ రమేష్, రాజేంద్రప్రసాద్, ఎఫ్ఏ లక్ష్మి, రాజు పాల్గొన్నారు.

నేడు షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ ఆదర్శ పాఠశాలలో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు క్రీడలు ప్రారంభమవుతాయని, ఇతర వివరాలకు జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావును 9440720514, పీడీ బి తిరుపతి 9949300668, పిఈటీ పాతిమాను సంప్రదించాలని పేర్కొన్నారు.

బజ్జీలు అమ్మిన జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-ఉట్నూర్

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా బుధవారం జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ ఉట్నూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ని గెలిపించాలని ప్రజలను కోరారు. పట్టణంలో బజ్జీలు అమ్మే దుకాణంలో బజ్జీలు అమ్ముతూ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్పక ఆరు గ్యారెంటీలు అమలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్, బాదంపల్లి జన్నారంటౌన్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు వేరువేరుగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సందర్భంగా ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలిగిస్తామన్నారు. 500కే సిలిండర్ రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తామన్నారు. ప్రజలు ఈ సారి చేయి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో వెడ్మ బొజ్జును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దుమల రమేష్, పసియుల్లా కిష్టాపూర్ గ్రామ కమిటీ సీనియర్ నాయకులు బండారి స్వామి, బాదం పెల్లి కాంగ్రెస్ నాయకులు సత్తన్న పాల్గొన్నారు

అక్రమంగా అమ్ముతున్న మద్యం పట్టివేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలపూర్ గ్రామానికి చెందిన ఓ కిరాణా షాపులో అక్రమంగా అధిక ధరలకు మద్యం అమ్ముతుండగా బుధవారం ఎక్సైజ్ సీఐ, ఎస్ బాబా, ఎస్సై రాటాల్లు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. పట్టుకున్న అక్రమ మద్యం విలువ రూ.18249 ఉంటుందని తెలిపారు. కిరాణా షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవన్నారు.